


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -175-

(28 ఏప్రిల్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**జరిగిపోయిన సంగతుల్ని గురించి** విచారపడటం, తలుచుకుని, తలుచుకుని నీళ్ళు కారడం చాలామందికి అలవాటు. పోను, పోను అది వారిలో రుగ్మతగా పరిణమించడం జరుగుతూ వుంటుంది.

"అయిపోయినదాన్ని గురించి ఎందుకు అంత ఆలోచించడం, క్రుంగిపోవడం?" అని ఎవరైనా అంటే "ఏం చెయ్యమంటారు? అది మనస్సులోంచి పోనిదే ఎన్ని మంచివిషయాలను తీసుకువచ్చి ముందు కూర్చోపెట్టినా, ఆ పాత విషయం వచ్చి వాటిముందు పచార్లు చేస్తోంది. ప్రక్కకు తొలగించడం నాకు సాధ్యం కావడంలేదు అంటారు పాపం."

వయస్సు పెరిగిన కొద్దీ పశ్చాత్తాపాలు ఎక్కువవడం సహజం కదా. అవన్నీ ఇంచుమించుగా తప్పిపోయిన రైళ్ళే అవన్నీ గుండెల్లో కూతలు వేస్తూ, నల్ల పొగ వదులుతూనే వుంటాయి.

ఈ గందరగోళం మధ్య మెల్లటి, చల్లటి విషయాలేం వినిపిస్తాయి. వేటిని ఆలోచించడానికి అవకాశం వుంటుంది? వీణలు చెవి దగ్గిర వాయించినా, గుండెల్లో జరిగే రణగొణ ధ్వనిముందు ఆ స్వరాలు వినిపించనే వినిపించవు" అది అలా జరిగింది. జరిగిపోయింది. జరగవలసింది కాదు. కాలం, కర్మం త్రోసుకువచ్చి అలా జరిగింది. కొంచెం ప్రయత్నించి ఆపి వేయవలసింది. కాని ఆ సమయంలో అంతగా తెలివితేటలు పని చెయ్యలేదు. అది నా ప్రారబ్ధం" అని నుదురు బాదుకుని బాధ పడే వారెందరో వుంటారు ఈ ప్రపంచంలో.

ఒక పండితోత్తముడికి వివాహమైంది. భార్య కాపరానికి వచ్చింది. ఇంకా కొద్ది రోజుల్లో మరదలు కూడా పెద్దదైంది. అందులో అందకత్తెగా కూడా తయారైంది. అప్పుడప్పుడూ అక్కగారింటికి వస్తూ వుండేది.

పాపం, ఆ పండితోత్తముడికి ఎక్కడ లేని పశ్చాత్తాపం బాధ, ఏర్పడేవి. తన భార్య అందకత్తె కాకపోవడం కారణం మరదలు డిటో పక్షిగా వుండకుండా రంగుల రామచిలకలాగా తయారు కావడం మరో కారణం...

ఆయనగారు మరదల్ని చూచినప్పుడల్లా "ఇది (మరదలు) ముందు పుట్టి అది (భార్య), తర్వాత పుడితే ఎంత బాగుండేది. అయిదేళ్ళు ఆలస్యం చేసింది. అందకత్తె (మరదలు). పోని నేనింకో అయిదేళ్ళు పెళ్ళికి ఆలస్యం చేసినా ఎంతో బాగుండేది. ఏం చేస్తాం బ్రతుకులు వెనక్కి పోవుకదా" అని నీళ్ళు కారుతూ వుండేవాడు.

ఒక ఆధునిక ఉద్యోగి నలభై యేళ్ళు దాటిన తర్వాత భార్య కన్నా తను ప్రేమించి వదిలివేసిన జాణే చాలా మంచిదనీ, అందకత్తె అనీ తెలుసుకున్నాడు. వెంటనే పశ్చాత్తాపం బయలుదేరింది.

"అప్పుడు పొరపాటు చేశాను. ఎలాగు ఆ అమ్మాయిని ప్రేమించాను. పెళ్ళిచేసుకుంటానని వాగ్ధానం చేశాను. కొద్దో గొప్పో సొమ్ము తగలేశాను. వంశ గౌరవాన్ని గాలిలో తూర్పార పట్టాను. అంత దూరం వచ్చి అమ్మాయిని వదిలి వెయ్యడమేమిటి? ఈ కలహంతో కల్యాణానికి అంగీకరించడమేమిటి?

పట్టిన పట్టు వదలకుండా బండి ఇంకా కొంచెం ముందుకు నడిపిస్తే సరిపోయేది. అంత బుద్ధి, అంత చాకచక్యం ఎలా వస్తాయి. నా వంటి చచ్చు మొహానికి ఇంతకీ ఆ రాతలేదు. ఈ గీత పూడదా" అనుకుంటూ ఎంతో బాధపడేవాడు.

ఇలా దాటిపోయిన బళ్ళను తలుచుకుని, ఎప్పుడు పడితే అప్పుడు వ్రేళ్ళు నోట్లో పెట్టుకుని ఈలలు వేసేవారెందరో వున్నారు పాపం. ఇప్పటికీ మనస్సు ఆగక ఆ దాటిపోయిన బళ్ళు తిరిగి వస్తాయనీ, వాటిని ఎర్రజెండా విసిరి ఆపివెయ్యాలనీ పగటి కలలు కంటూనే వుంటారు.

ప్లీడరు పట్టాపుచ్చుకుని వీధిలో గోడకు బల్లకట్టి సావిట్లో కుర్చీలో తాను, క్రింద చాపమీద కూర్చుని గోడకు అనుకుని గుమస్తా ప్రతినిత్యం కునికిపాట్లు పడటం అలవాటైన పెద్ద మనిషి పదిగంటలు దాటడం చూసి దిగ్గునలేస్తూ "ఛీ అసలీ చదువు చదవకుండా వుండవలసింది. డాక్టరు చదువుదామని బయలుదేరినవాణ్ణి బుద్ధి గడ్డి మేయడంవల్ల వచ్చి ఇందులో పడ్డాను. ఇప్పుడేం అనుకుంటే ఏం లాభం కుటుంబరావుగారూ మీరింటికి దయచెయ్యండి" అనడం.

ఆ గుమస్తా కుటుంబరావు ఉలిక్కిపడి లేచి "అసలు నేనీ ఊరు వచ్చింది వక్కపొడి పొట్లాలు తయారు చేద్దామని. తీరా చూస్తే మార్కెట్ నిండా అవే కనిపించాయి. వాటితో పోటీ చెయ్యలేక వచ్చి మీ దగ్గర చేరా. మన ఇద్దరి జాతకాలూ టకామని కలిసినాయి. లాయరుగారూ! మీరు డాక్టరైవుంటే నేను తప్పకుండా మీ కాంపౌండర్‌నై వుండేవాణ్ణి" అంటూ అతగాడు బయటికి పోవడం జరుగుతూ వుంటుంది.

మా బంధువుల్లో ఒకాయన తన గొప్పతనం చూపించాలని పల్లెటూర్లో ఒక పెద్దమేడ కట్టాడు. రాను రాను ఆయన యింటిపేరు మేడ అయిపోయింది. అందరూ ఆయన్ని మేడ పున్నయ్యగారనేవారు. అది ఎంతో గర్వంగా వుండేదాయనకు.

కొంతకాలానికి ఆయనగారి పొలం అంతా పోయింది అప్పుల క్రింద. ఒక్క మేడ మాత్రమే మిగిలింది. అప్పటినుంచి ఆయన ప్రారంభించాడు. "ఈ మేడ ఏ బస్తీలోనన్నా కడితే బాగుండేది. బోలెడు అద్దె వచ్చేది. కుటుంబం హాయిగా గడిచిపోయేది. చాలా పొరపాటు చేశాను" అని.

ఆ భావం ఆ పశ్చాత్తాపం ఆయన్ని ఆవరించి వదలలేదు. ఎవరైనా కనిపించి, ఏమిటి పున్నయ్యగారూ విశేషాలంటే ఏం వుంటాయి. "ఈ మేడ ఏ బెజవాడలోనో కడితే బోలెడు విశేషాలుండేవి. అప్పుడు తట్టలేదు. ఇప్పుడు కట్టలేను" అనేవాడు.

"మీ ఆరోగ్యం ఎలా వుంది పున్నయ్యగారూ?" అంటే "ఆరోగ్యం ఎందుకు బాగుంటుంది. బొత్తిగా బాగుండటంలేదు. ఈ మేడ ఏ బెజవాడలోనో కడితే ఎంతో హాయిగా వుండేది ఆరోగ్యం. భీముడంత బలం వచ్చేది. అప్పుడు తట్టలేదు.యిప్పుడు కట్టలేను" అనేవాడు పాపం.

ఇలా ఒక పనిచేసి దాని తలుచుకుని బాధపడటం మానవుల్లో వుండే ఒక విధమైన బీదతనం క్రిందనే జమపడుతుంది. అయినా మానవ ప్రవృత్తి అలా మెడ వెనక్కి తిప్పుకుని మనస్సును, చక్కిలాల పిండిని మెలికలు తిప్పినట్లు తిప్పుతూనే వుంటుంది. భవిష్యత్తులోగల సుంకాన్ని గూడా నమిలి మ్రింగేస్తూనే వుంటుంది.

Post your comments